క్లుప్తంగా

నేడు శ్రీప్రసన్నాంజనేయ స్వామి వార్షికోత్సవం

గురజాల : పట్టణంలో రెడ్డిబండ్ల సెంటర్‌లో వేంచేసియున్న శ్రీ మహిమాన్విత శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవాలయం వార్షికోత్సవ వేడుకలు గురువారం నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తెల్లవారు జామునుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం సమయంలో అన్న ప్రసాదం అందించడం జరుగుతుందని ప్రతి ఒక్కరూ పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. సాయంత్రం సమయంలో స్వామి వార్లను ప్రత్యేకంగా వాహనంపై ఉంచి గ్రామ పురవీధుల్లో ఊరేగించడం జరుగుతుందన్నారు.

సింగరుట్లలో నృసింహ స్వామి కల్యాణం

కారెంపూడి: సింగరుట్ల లక్ష్మీనృసింహస్వామివారి కల్యాణోత్సవం శనివారం జరుగుతుందని ఆలయ ఈఓ పి సైదమ్మబాయి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పేట సన్నెగండ్ల గ్రామంలో ఉన్న స్వామి వారి ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాలతో సింగరుట్ల చేర్చిన అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభం అవుతాయి. శ్రీసుదర్శన నారసింహ హోమం, నృసింహ జయంతి కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం సాయంత్రం స్వామి వారి కల్యాణం జరుగుతుందని తెలిపారు. కల్యాణం వీక్షించడానికి వచ్చే భక్తులకు శ్రీచక్ర సిమెంట్స్ అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తుందని తెలిపారు.

పంచాయతీ కార్యదర్శిగా రత్నం బాధ్యతల స్వీకరణ



దాచేపల్లి : కేసానుపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా నాగెండ్ల రత్నం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తంగెడ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన మంగేశ్వరరావు తంగెడకు బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన రత్నంను సర్పంచ్ వినుకొండ కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కోట కృష్ణ, ఉపసర్పంచ్ కోట కొండలు, ఎంపీటీసీ చెట్టిపాగు ఏసుదాసు, నాయకులు చుండు రామారావు, ఉల్లేరు హనుమంతరావు, గంగరాజు, చెట్టిపాగు ఏనయ్య, మీసాల నతానియేలు, వినుకొండ చిన్నదానయ్య తదితరులు శాలువా, పూలదండలతో సన్మానించారు. గ్రామాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సహకారంతో గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని పంచాయతీ కార్యదర్శి రత్నం చెప్పారు.

వాసవి క్లబ్ నూతన కమిటీ ఎన్నిక



మాచర్ల: పట్టణానికి చెందిన వాసవి క్లబ్ నూతన కమిటీ ఎంపిక ప్రక్రియ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వాసవి క్లబ్ మహిళా లక్ష్మీ చెన్నకేశవ క్లబ్ అధ్యక్షులుగా మేడా వెంకటలక్ష్మి, ప్రధాన కార్యదర్శి నేరేళ్ళ సుభాషిణి, కోశాధికారి కొప్పురావూరి నీరజలను ఎంపిక చేసినట్లు జిల్లా గవర్నర్ కజ్జాయం విజయలక్ష్మి, మండవ కిరణ్‌కుమార్‌లు తెలిపారు. పట్టణంలోని సాయి వాసవి సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో కమిటీ సభ్యులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాసవి క్లబ్ ద్వారా కోట్లాది రూపాయలు సేవా కార్యక్రమాల ద్వారా అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఓరుగంటి చెన్నకేశవరావు, వ్యవస్థాపక అధ్యక్షుడు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, జోన్ చైర్మన్ మేడం నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పందిరి నరసింహారావు, ముప్పవరపు నాగార్జున, జాయింట్ సెక్రెటరీ బచ్చు రాజకుమార్, తదితరులున్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

శావల్యాపురం: మండలంలోని పోట్లూరు గ్రామంలో బీసీ కాలనీలో బాల వికాస్ స్వచ్ఛంధ సంస్థ, పంచాయతీ వారి సారధ్యంలో రూ. 4లక్షల నిధులతో తాగునీటి సమస్య పరిష్కార దిశగా చర్యలు చేపట్టినట్లు సర్పంచ్ పోపూరి జ్యోతి బుధవారం తెలిపారు. కొంకెరువాగు సమీపంలో 500 మీటర్ల మొర కాలనీలోకి పైపు లైను ఏర్పాటు చేసి తదుపరి విద్యుత్ మోటార్ల ద్వారా తాగునీరు కాలనీవాసులకు అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఇందులో భాగంగా బీసీ కాలనీలో 1000 లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ షెడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశామన్నారు. నెల రోజుల వ్యవధిలో పనులు పూర్తి అవుతాయన్నారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వంగళ్ళ అంజయ్య, తమ్మిశెట్టి అంకారావు, అబ్బూరి రామారావు, అయ్యన్న,పోపూరి చిన్నా, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారి కల్యాణోత్సవం

రొంపిచర్ల: మండలంలో వీరవట్నం గ్రామంలో వేంచేసియున్న శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో బుధవారం శ్రీ బ్రహ్మంగారి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో శ్రీ బ్రహ్మంగారి స్వామివారిని, గోవిందమాంబ అమ్మ వారిని ప్రత్యేకంగా, అందంగా అలంకరించి విశేష, సహస్రనామ, కుంకుమార్చన, అలంకరణ పూజలు నిర్వహించారు.

ప్రజా సంక్షేమమే సీఎం వైఎస్ జగన్ ధ్యేయం

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



లబ్ధిదారులకు పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

మాచర్ల: రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి మేలు చేయటమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని, అందులో భాగంగానే అనేక సంక్షేమ పథకాలను ప్రతి పేద కుటుంబానికి అందించడం జరుగుతుందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకష్ణారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని 27వ వార్డు సచివాలయ పరిధిలో వార్డు కౌన్సిలర్ షేక్ మదార్ సాహెబ్ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పీఆర్కే మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీలతో పాటు అన్నీ వర్గాలకు మేలు చేసే సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి అన్ని పథకాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. తూర్పు బావి వద్ద గల కొమ్ముళ్ల కాలువ వద్ద కౌన్సిలర్ మదార్‌సాహెబ్ ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి తిరుగుతూ లబ్ధిదారులకు ప్రభుత్వం ద్వారా చేకూరిన పథకాలను వివరించి కరపత్రాలను అందించారు. రాబోయే రోజుల్లోనూ ప్రతి గడపకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోనే మేలు జరుగుతుందని, ప్రతి పథకం కొనసాగుతుందని చెప్పారు. గత మూడున్నర సంవత్సరాలుగా ప్రభుత్వం అందజేసిన సంక్షేమ అభివద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ నేపథ్యంలో రాబోయే రోజుల్లో ప్రభుత్వానికి అండగా నిలబడి మరోసారి సీఎం జగన్‌కు జేజేలు పలకాలని కోరారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాత్రి 10.30గం''ల వరకు కొనసాగినా ప్రజలందరూ, నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తుంటే తెలుగుదేశం పార్టీ వారు అనవసరమైన ఆరోపణలు చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ నాయకులకు సైతం వారి ఖాతాల్లో నేరుగా నగదు బదిలీ చేయడం జరుగుతుందన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నేటి వరకూ వారి ఖాతాల్లో చూసుకుంటే వారికే తెలుస్తుందన్నారు. అభివృద్ధి చేస్తున్నది ఎవరో ప్రజలందరికీ తెలుసునన్నారు. అర్హులై ఉండి పథకాలు రాని వారు ఉంటే పథకాలు మంజూరు చేయించే బాధ్యత తనదేనని పీఆర్కే అన్నారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్‌లు తురక కిషోర్, అబ్దుల్ జలీల్, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కామనబోయిన కోటయ్య, గ్రీనరీ అండ్ బ్యూటీషియన్ రాష్ట్ర డైరెక్టర్ ఉప్పలపాటి జాని, లెదర్ కార్పొరేషన్ డైరెక్టర్ బూదాల మరియమ్మ, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యరబోతుల శ్రీనివాసరావుతో పాటు, కౌన్సిలర్లు పోలా శ్రీను, మస్తాన్, షేక్ కరిముల్లా, దస్తగిరి, మాచర్ల చిన ఏసోబు, షేక్ సుభాని, మున్సిపల్ మాజీ చైర్మన్ చత్తా సాహెబ్, షేక్ బాజి, జలీల్ బాషా, నాగూర్ బాషా, జాకీర్, చిన్న మస్తాన్, చికెన్ మస్తాన్, అంగార్ బాషా, గౌస్‌పాషా, రహమాన్, అబ్దుల్ బాషా, అల్లావుద్దీన్, నాగూర్, అజీజ్ బాషా, సులేమాన్ పాషా, వైఎస్సార్‌సీపీ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

‘మా నమ్మకం నువ్వే జగనన్న’ విజయవంతం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పిడుగురాళ్ల: గురజాల నియోజకవర్గం, మాచవరం , పిడుగురాళ్ల పట్టణ, మండలంలోనిప్రతి ఇంటికి వెళ్లి మా నమ్మకం నువ్వే జగన్, మా భవిష్యత్ నువ్వే జగన్ కార్యక్రమం విజయవంతం అయిందని పట్టణ కన్వీనర్, మండల, మాచవరం మండల కన్వీనర్లు చింతా వెంకట రామారావు, చల్లా పిచ్చిరెడ్డి, చౌదరి సింగరయ్యలు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మా నమ్మకం నువ్వే జగన్, మా భవిష్యత్ నువ్వే కార్యక్రమం విజయవంతం చేసినందుకు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ, మండలంలోని ప్రతి గడప తట్టి వారికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు అందినాయి, మాకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగించాలని నమ్మకంతోనే ఉన్నామని తెలియజేశారని, అంతేకాకుండా పట్టణ, మండలంలో మొత్తం 90శాతం మా నమ్మకం నువ్వే జగన్, మా భవిష్యత్ నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారని వారు తెలియజేవారు. గత నెల 7వ తేదీ నుంచి 29వ తేదీ వరకు నిర్వహించి మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో పాల్గొన్న కౌన్సిలర్లు, గృహసారథులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు అందరు ప్రతి ఇంటికి వెళ్లి వారి ద్వారా : 8296082960 నంబర్‌కు వారికి నచ్చితేనే మిస్డ్ కాల్ ఇప్పించటం జరిగిందన్నారు. అందరు స్వతహాగా మిస్డ్ కాల్స్ ఇచ్చి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మరలా సీఎం కావాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలియజేసినట్లు వారు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి, మాజీ జెడ్పీటీసీ వీరభద్రునిరామిరెడ్డి, యల్లారెడ్డి, జూలకంటి శ్రీనివాసరావు, గొట్టిముక్కల పవన్‌రెడ్డి, ఎండీ లతీఫ్, చల్లగుండ్ల సంతోషరావు ఉన్నారు.

నేడు వీరాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం

పిడుగురాళ్ల రూరల్ : మండలంలోని వీరాపురం గ్రామంలో నేడు (గురువారం) గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి తెలిపారు. కార్యక్రమానికి గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి , ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, శాసన మండలి విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి హాజరవుతారని తెలిపారు. కావున మండలంలోని పలు గ్రామాల ప్రజా ప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు ప్రతిష్ట మహోత్సవాలు

గురజాల : నగర పంచాయతీ పరిధిలోని జంగ మహేశ్వరపురంలో గురువారం పలు దేవాలయాల ప్రతిష్ట మహోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని ఆయా దేవాలయాల కమిటీ సభ్యులు తెలిపారు. శ్రీ నరసింహ స్వామి వారి దేవాలయంతో పాటు మడేలయ్య స్వామి దేవాలయం, రాముల వారి దేవాలయంలు కూడా ప్రతిష్ట జరుగుతుందన్నారు. భక్తులు ఈ ప్రతిష్టా మహోత్సవాల్లో పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించాలన్నారు.

నేడు నరసింహ చతుర్ధశి మహోత్సవం

మాచర్ల: పట్టణంలోని పీడబ్ల్యూడి కాలనీలో హరేకృష్ణ ఆశ్రమంలో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రీ నరసింహ చతుర్ధశి మహోత్సవములు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. పీడబ్ల్యూడి కాలనీలో ఉన్న ఆశ్రమంలో సాయంత్రం 6గం''లకు భజనలు, హరినామ సంకీర్తన, సి నరసింహ్మా, భగవాన్ వైభవం ప్రవచనం, మహా మంత్ర జపం, హారతి, కీర్తన కార్యక్రమాలు నిర్వహించి అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరపనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు : 8309439335, 8897882044లను సంప్రదించాలని కోరారు.

కార్మికులు ఐక్యంగా ఉండాలి

దాచేపల్లి : కార్మికులు ఐక్యంగా ఉండాలని వైఎస్సార్ సీపీ కార్మిక విభాగం పార్లమెంట్ మాజీ అధ్యక్షుడు, చిప్స్ అండ్ ఫల్వరైజ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు గద్దల వేదమణి అన్నారు. నడికుడిలో బుధవారం మేడే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేదమణి మాట్లాడుతూ...వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ముగ్గుమిల్లుల్లో కార్మికులకు చేతినిండా ఉపాధి దొరుకుతుందని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ముగ్గుమిల్లుల్లో పనిచేసే కార్మికులకు అండగా ఉన్నారని, ఎమ్మెల్యే కాసు సహకారంతో ముగ్గుమిల్లుల్లో తాగునీటి సౌకర్యం కోసం చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్రీపతి ఏసోబు, సయ్యద్ సుభానీ, కోయ శ్రీను, నాగరాజు, దానియేలు, బాలరాజు పాల్గొన్నారు.

ఇళ్లను నిర్మించుకునే విధంగా చైతన్యపర్చండి

ప్రాజెక్టు మేనేజర్ సుబ్బారావు



మాట్లాడుతున్న ప్రాజెక్టు మేనేజర్ సుబ్బారావు, సిఓలు, మహిళా సమైఖ్య అధ్యక్షురాలు మరియమ్మ

మాచర్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీల నిర్మాణానికి సంబంధించి ప్రతి డ్వాక్రా మహిళకు అవగాహన కల్పించి ఇళ్ల నిర్మాణం చేసుకునే విధంగా చూడాలని పట్టణ మెప్మా ప్రాజెక్టు ఆర్‌పిలను ప్రాజెక్టు మేనేజర్ ఎం సుబ్బారావు కోరారు. బుధవారం పట్టణంలోని మెప్మా కార్యాలయంలో నిర్వహించిన పట్టణ మహిళా సమైఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో అర్బన్ మార్టులో ఏర్పాటులోనూ ఆర్పీలు కీలక పాత్ర పోషించాలన్నారు. డ్వాక్రా సంఘాల సభ్యులు ప్రభుత్వం కల్పించే నిధులను సద్వినియోగం చేసుకోవాలని మార్టులో ముందుకెళ్ళాలని చెప్పారు. నూతన సంఘాలను పెంచటం, ఉన్న డ్వాక్రా సంఘాలకు ఋణాలిప్పించటం, అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు డ్వాక్రా మహిళలకు అందేలా చూడాలన్నారు. సమావేశంలో రాష్ట్ర లెదర్ కార్పొరేషన్ డైరెక్టర్ బూదాల మరియమ్మ, సిఓ రాజశేఖర్, అంజలితో పాటు ఆయా వార్డు ఆర్పిలు పాల్గొన్నారు.

హనుమత్ వాహనంపై దర్శనమిచ్చిన రంగనాధుడు



హనుమత్ వాహనంపై ఊరేగుతున్న రంగనాధుడు

యడ్లపాడు: మండలంలోని సొలస గ్రామంలో గీతా నామస్మరణతో మార్మోగింది. పురాతన ఆలయం శ్రీభూసమేత రంగనాయకస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. మూడోరోజైన బుధవారం నాడు ఆలయంలోని మూలవిరాట్‌కు గులాబీలతో అలంకరణ వార్షిక ప్రత్యేక పూజల్ని ఆలయ ప్రధాన అర్చకులు పర్చూరి రామకృష్ణమాచార్యులు నేతృత్వంలో జరిగాయి. మధ్యాహ్నం గోవిందుడి విగ్రహాన్ని ధర్మకర్తలు అర్వపల్లి మనోహర్, నాగజ్యోతి, అర్వపల్లి బ్రదర్స్ ఆధ్వర్యంలో గోవింద నామాన్ని జపిస్తూ ప్రదర్శనగా తెచ్చి ఆలయంలో కొలువుంచి పూజలు చేశారు. ఈ సందర్భంగా గుంటూరు, పెదకూరపాడు ప్రాంతాలకు చెందిన భక్త సమాజంచే గీతా పారాయణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అర్చన హోమం, రంగనాధుడి కల్యాణ వేడుకల్లో భాగంగా అర్వపల్లి సాంబశివరావు, కామేశ్వరీ దేవి, అర్వపల్లి వెంకటస్వామి, వెంకట రాజరాజేశ్వరీ దంపతులు పీటలపై కూర్చొని పూజలు చేశారు. సాయంత్రం రంగనాధుడికి పట్టువస్త్రాలు, వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి హనుమత్ వాహనంపై ఊరేగించారు. ప్రధాన వీధుల్లో జరిగిన గ్రామోత్సవంలో గ్రామపెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ ఆధ్మాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు అన్నదానం, పలు రకాల ప్రసాదాలు వినియోగం చేశారు. ఆయా కార్యక్రమాలను ఆలయ ఈవో సీహెచ్ శివయ్య పర్యవేక్షించారు.

రేపు బొప్పూడి బాజీబాబా దర్గా ఉరుసు



బాజీబాబావారి దర్గా

చిలకలూరిపేటటౌన్: మండలంలోని బొప్పూడి గ్రామంలో వేంచేసి ఉన్న హజరత్ సయ్యద్ బాజీ బాబా 40వ ఉరుసు మహోత్సవం శుక్రవారం నిర్వహించనున్నట్లు దర్గా ముజావర్ బాలసైదా బాబు, అభివృద్ధి కమిటీ సభ్యులు బాజీషహీద్ బ్యాటరీవర్క్స్ షేక్ ఖాజా తెలిపారు. బొప్పూడి గ్రామం ప్రారంభంలో ఉన్న ఈ దర్గాలో ఈనెల 5వ తేదీన వేకువ జామునుంచే ఉరుసు ఉత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. ఈ సందర్భంగా దర్గాకు మరమ్మతులు, నూతన రంగులు వేయించారు. ఉరుసు ఉత్సవాలకు విచ్చేసి భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఏటా క్రమం తప్పకుండా భారీగా చేసే ఈ ఉరుసు ఉత్సవాలు రెండేళ్ల కోవిడ్ కాలంలో నిర్వహించ లేదన్నారు. ఈ ఏడాది భారీగా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గ్రామం నుంచి దర్గావరకు, అక్కడ నుంచి హైవేవెళ్లే మార్గంలో కొంత మేర విద్యుత్తు దీపాలంకరణ చేస్తున్నట్లు వివరించారు. సుదూర ప్రాంతాల నుంచి బాజీబాబా దర్శనానికి వచ్చే భక్తుల కోసం శుక్రవారం రాత్రి భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. అదేరోజు రాత్రి బొప్పూడి గ్రామం నుంచి బాబావారీ గంథం బయలుదేరి గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగింపు ఉంటుందన్నారు. దర్గా వద్ద పలు ఖురాన్ బోధన, నమాజ్ తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలతో భక్తులు జాగరం చేస్తారన్నారు. మరుసటి రోజు శనివారం తెల్లవారుజామున గంథం దర్గాకు చేరుకుంటుదని, ముజావర్ల ఆధ్వర్యంలో బాబావారికి ఫాతెహా(దీపారాధన) నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం గంథం, ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వైభవోపేతంగా నిర్వహించే ఈ ఉరుసుమహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై బాజీబాబాను దర్శించుకోవాలని కోరారు.

రైతుల ప్రయోజనాల కోసమే రైతు భరోసా కేంద్రాలు

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

మిట్టగుడిపాడు(రెంటచింతల): రైతుల ప్రయోజనాల కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు అందుబాటులో ఉండేలా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మిట్టగుడిపాడు గ్రామంలో రూ.21.80 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.17.50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన వైఎస్సార్ హెల్త్ క్లీనిక్, రూ. 15.74 లక్షలతో నిర్మించిన పాలకేంద్రాలను ఆయన పార్టీ నేతలతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో అన్నదాతలకు అండగా నిలిచేలా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి అనేక సేవలు అందిస్తూ ఇది రైతు ప్రభుత్వమని చాటి చెప్పారన్నారు. గ్రామాల్లో ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో ఒక రైతుభరోసా కేంద్రం ద్వారా వ్యవసాయం, అనుబంధరంగాల్లో రైతులకు 10 రకాల సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. పంటలను రక్షించడానికి తక్కువ ఖర్చుతో కూడిన సాంకేతిక పద్దతులపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించడంలో రైతు భరోసా కేంద్రాలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా మన రాష్ట్రంలోని రైతులకు రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు ట్రాక్టర్లను, వ్యవసాయ యంత్ర పరికరాలను అందించడంతో పాటు రైతులు సాగుచేస్తున్న పంటలకు సంబంధించి సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇప్పటికే రైతు గ్రూపులకు ట్రాక్టర్లను, వ్యవసాయ యంత్రాలను, వరికోత మిషన్‌లను అందజేసినట్లు తెలిపారు. గ్రామ వ్యవసాయ సహాయకులు ఈ భరోసా కేంద్రాల్లో ఉంటూ రైతులకు ఎప్పటికప్పుడు రైతులకు కావాలసిన సాంకేతికత, వారి అవసరాలు తెలుసుకుని రైతులకు సహాయపడతారన్నారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం రైతులకు మద్దతు ధర చెల్లించి ధాన్యాన్ని, కందులు, సెనగలను కొనుగోలు చేస్తూ రైతులకు ఎంతో మేలు చేస్తుందన్నారు. గ్రామీణులకు మెరుగైన వైద్యం అందించడానికి వైఎస్సార్ క్లీనిక్‌లను, పాడి రైతులకు ఆదుకునేందుకు పాలకేంద్రాలను కూడ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొట్టం ప్రమీలగురవారెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ శౌంఠిరెడ్డి నర్సిరెడ్డి, మాచర్ల వ్యవసాయ సంచాలకులు జగదీశ్వర్‌రెడ్డి, ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, పీఆర్‌ఏఈ పాశం శ్రీనివాసరెడ్డి, ఏఓ బోయపాటి బ్రహ్మారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పూజల రామయ్య, జడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి, పార్టీ నేతలు గొట్టం భాస్కర్‌రెడ్డి, మోర్తల ఉమ, ఓర్సు కాశయ్య, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అంకమ్మతల్లి దేవాలయం ప్రతిష్ట మహోత్సవం



ఆలయంలో ప్రతిష్ఠించిన అంకమ్మతల్లి విగ్రహం




అంకమ్మతల్లికి పూజలు చేస్తున్న మాజీ మంత్రి కాసు వెంకటకృష్ణారెడ్డి

దాచేపల్లి : మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో శ్రీ అంకమ్మతల్లి దేవాలయం ప్రతిష్ట మహోత్సవం బుధవారం కన్నుల పండువలా జరిగింది. బ్రహ్మర్షి వీరం భట్లయ్య స్వామి పర్యవేక్షణలో ఆలయ ప్రతిష్ట కార్యక్రమాన్ని జరిపించారు. తెల్లవారుజాము నుంచే ప్రతిష్ట పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక హోమం కార్యక్రమాన్ని జరిపించారు. అనంతరం అంకమ్మతల్లి, పోతురాజు విగ్రహాలను ఆలయ గర్భగుడిలో ప్రతిష్ఠించారు. అదే విధంగా గ్రామంలోని సీతరామస్వామి వారి నూతన ధ్వజస్తంభ ప్రతిష్టను కూడా జరిపించారు. భక్తులు వేల సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఆలయ ప్రతిష్ట సందర్భంగా సుమారుగా 25 వేల మందికిపైగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటుగా ఎంపీటీసీ జంగిలి నరసింహారావు, మాజీ ఎంపీటీసీలు గుడూరి గోవర్ధన్‌రావు, జక్కా అనంతరామయ్య, మాజీ సర్పంచ్ టంటం శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ మేడతి నరసింహరావు, నాయకులు జంగిలి వెంకటేశ్వర్లు, రాచకొండ కోటయ్య, పాలిశెట్టి శ్రీనివాసరావు, జక్కా వెంకటేశ్వర్లు, పసుపులేటి నరసింహరావు, ద్రోణాదుల రమణ పాల్గొన్నారు.

పూజలు చేసిన మాజీ మంత్రి కాసు ...

అంకమ్మతల్లి దేవాలయం ప్రతిష్ట కార్యక్రమంలో మాజీ మంత్రి కాసు వెంకట కృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు మాజీ మంత్రి కాసుకు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ట మహోత్సవం



ప్రతిష్ఠించిన పార్వతి దేవి విగ్రహం



ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

రెంటచింతల: మండలంలోని మిట్టగుడిపాడు గ్రామంలో వేంచేసియున్న నాగేశ్వరస్వామి ఆలయంలో పార్వతి, గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర, చండీశ్వర, నందీశ్వర,చక్ర కలశ స్థాపన, వీరాంజనేయ స్వామి ఆలయంలో గణపతి, ఒంటి వాహనం, శిఖరం, రామాలయంలో పంచకలశలముల దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ట మహోత్సవం బుధవారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ చాగి నరసింహ మూర్తి, బ్రహ్మశ్రీ వెలటూరి నాగేశ్వర శర్మల ఆధ్వర్యంలో 20 మంది రుత్వికులు ఈప్రతిష్ట మహోత్సవం వేద మంత్రాల నడుమన జరిపారు. ఉదయం 7 గంటలకు మండప దేవతాపూజలు, 8.15 గంటలకు యంత్ర స్థాపనములు విగ్రహాల ప్రతిష్ట, ప్రాణ పతిష్ట, గంగా పార్వతి సమేత నాగేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవం వైభవంగా జరిపించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపాల్గొన్నారు. పూర్ణకుంభంలో ఘనంగా స్వాగతం పలికారు. స్వామివార్లకు ప్రభుత్వ విప్ పీఆర్కే పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో శాంతియుత వాతావరణం, పాడిపంటలతో కళకళలాడాలని ఆకాంక్షించారు. అనంతరం వేలాది మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం పీఆర్కే ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ గొట్టం ప్రమీలా గురువారెడ్డి, మాజీ సర్పంచ్ గొట్టం సుబ్బారెడ్డి, జిల్లాపరిషత్ వైస్ చైర్మన్ సౌంటి నర్సిరెడ్డి, ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, మండల పార్టీ అధ్యక్షుడు పి.రామయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరు భాస్కరరెడ్డి, పలు గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. భక్తులకు స్వామి వారి ప్రసాదాలు నిర్వాహకులు అందించారు.

గొరిజవోలులో పునఃప్రతిష్ట మహోత్సవం



శాంతిహోమాలు నిర్వహిస్తున్న వేదపండితులు

నాదెండ్ల: మండలంలోని గొరిజవోలు గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. గ్రామంలో సుమారు రూ.90 లక్షల వ్యయంతో పలు ఆలయాలను జీర్ణోద్ధరణ పనులు గావించి గురువారం ఉదయం పునఃప్రతిష్టా మహోత్సవాలు నిర్వహించనున్నారు. కార్యక్రమాల నిర్వహణకు కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. వరసిద్ధి ఆలయ పునఃప్రతిష్ట, ఎదురుగా నందీశ్వరుడు, జీవధ్వజస్తంభం, విమాన గోపుర కలశ ప్రతిష్ట, సీతాలాంబ (బొడ్డురాయి), నాలుగుదిక్కుల గవిడి రాళ్లు, శ్రీ పోలేరమ్మ అమ్మవారు, పోతురాజు, శ్రీ అంకమ్మ తల్లి (గ్రామ దేవత) ఆలయాల పునఃప్రతిష్ట కార్యక్రమాలను గురువారం ఉదయం 7.19 గంటలకు ప్రారంభం కానున్నాయి. పండితులు శ్రీమాన్ పర్చూరి మాధవాచార్య, బ్రహ్మశ్రీ కౌశిక్ వెంకట రమణ స్వామి బృందం ఆధ్వర్యంలో ఈ ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. రెండు రోజులుగా ప్రత్యేక చలువ పందిళ్లలో శాంతిహోమాలు నిర్వహిస్తున్నారు. ప్రతిష్ట అనంతరం అన్నదానం చేయనున్నారు. ఆలయాలను విద్యుత్‌దీపాలతో అలంకరించారు. రాత్రి మహిళా కోలాటం, భజనా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.